సాక్షి అనంతపురం

శనివారం । 22 । ఫిబ్రవరి । 2025



చీనీ టన్ను రూ.22,200

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22,200 ప్రకారం పలికాయి.



అధికారుల నిర్లక్ష్యం.. ఆర్టీసీకి నష్టం

టోల్‌ఫీజు తగ్గింపు అవకాశం ఉన్నా అధికారులు నిర్లక్ష్యం చేయడంతో ఆర్టీసీకి భారీగా నష్టం వాటిల్లింది. ఉరవకొండ డిపోలో ఈ ఘటన చోటు చేసుకుంది. 8లో

గరిష్టం/కనిష్టం

37.3°/17.1°

జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చలి తీవ్రత తగ్గుతుండగా ఎండలు క్రమంగా పెరుగుతున్నాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

డ్రిప్ లక్ష్యం పూర్తి చేయాలి



మాట్లాడుతున్న పుల్లారెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాకు నిర్దేశించిన 18 వేల హెక్టార్ల డ్రిప్, స్ప్రింక్లర్ల లక్ష్యాన్ని మార్చి 20 లోపు పూర్తి చేయాలని ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు (ఏపీఎంఐపీ) ఆఫీసర్ అన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ- టెక్నికల్) డాక్టర్ చేరెడ్డి పుల్లారెడ్డి ఆదేశించారు. స్ప్రింక్లర్ యూనిట్ ఏర్పాటుకు సంబంధించి తనిఖీ నిమిత్తం అనంతపురం వచ్చిన ఆయన శుక్రవారం సాయంత్రం ఏపీ ఎంఐపీ కార్యాలయంలో పీడీ బి.రఘునాథ రెడ్డి, ఏపీడీ జి.ఫిరోజ్‌ఖాన్, సూపరెండెంట్ వరప్రసాద్‌తో సమావేశమై ప్రాజెక్టు పనితీరు, సమస్యలపై ఆరా తీశారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల కన్నా అనంతపురానికే అధిక కేటాయింపులు ఉన్నాయన్నారు. ఇందుకు తగ్గట్లుగా సాధ్యమైనంత ఎక్కువ మంది రైతులకు పరికరాలు అందిస్తున్నామన్నారు. వచ్చే 2025–26 నుంచి విధి విధానాలు, ప్రోత్సాహక రాయితీల్లో మార్పులు చేర్పులు ఉండవచ్చన్నారు. ఎస్సీ ఎస్టీ వర్గాలకు 100 శాతం రాయితీ అవకాశం ఉంటుందేమో వేచి చూడాలన్నారు.

28న సైన్స్ సంబరాలు

అనంతపురం ఎడ్యుకేషన్: జాతీయ సైన్స్ డే సందర్భంగా ఈ నెల 28న జిల్లాలోని అన్ని పాఠశాలల్లో సైన్సు సంబరాలు నిర్వహించి విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించాలని డీఈఓ ప్రసాద్ బాబు అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, స్మార్ట్ టీవీలను వినియోగించుకొని ప్రఖ్యాత శాస్త్రవేత్తల జీవిత విశేషాలు, వారు ప్రపంచానికి అందించిన ఆవిష్కరణలు, ఇస్రో సాధించిన విజయాలను విద్యార్థులకు చూపించి వారిలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని సూచించారు. 'సైన్స్ క్విజ్, 'పాఠశాల స్థాయి సైన్స్ ఫెయిర్', 'సైన్స్ నాటికలు నిర్వహించాలన్నారు. 'ప్రపంచ గతిని మార్చిన సైన్స్ అవిష్కరణలు' అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. జిల్లాలోని సైన్స్, మ్యాథ్స్ ఉపాధ్యాయులు సైన్స్ డేలో పాల్గొనాలని ఆదేశించారు.

ఆ ఉద్యోగుల బదిలీలు రద్దు

అనంతపురం టౌన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో పలువురు అధికారులు, ఉద్యోగుల బదిలీలు రద్దయ్యాయి. ఉమ్మడి జిల్లాలో అనంతపురం రామ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ యూనస్, రాయదుర్గం సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు, పెనుకొండ సబ్ రిజిస్ట్రారు వెంకటనాయుడు, సీనియర్ అసిస్టెంట్లు జయదీప్, శ్రీనివాసరెడ్డి తదితరులను డిప్యుటేషన్‌పై విజయవాడలోని ఐజీ కార్యాలయానికి రెండు రోజుల క్రితం బదిలీ చేశారు. అయితే బదిలీ ఉత్తర్వుల్లో 45 సంవత్సరాలలోపు వయస్సు నిబంధనతోపాటు డైరెక్ట్ రిక్రూట్ అయి ఉండాలనే నిబంధనలు ఉండడంతో వారందరూ బదిలీకి అనర్హులుగా గుర్తించి ఐజీ కార్యాలయ అధికారులు జాయినింగ్ ఆర్డర్లు ఇవ్వకుండా వెనక్కు పంపారు. వీరందరిని తిరిగి వారి స్థానాలకు కేటాయించనున్నట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ విజయలక్ష్మి తెలిపారు.

మద్యం మత్తులో రైలింజన్ ఎక్కి..



గాయపడిన సలీం

గుత్తి: మద్యం మత్తులో ఓ యువకుడు తానేమి చేస్తున్నాడో తెలియని స్థితిలో విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.... తెలంగాణలోని మహబూబ్‌నగర్‌కు చెందిన సలీం మద్యానికి బానిసగా మారి జులాయిగా తిరిగేవాడు. ఫుల్‌గా మద్యం సేవించి రైలు ఎక్కి ఎక్కడ పడితే అక్కడ దిగేవాడు. ఈ క్రమంలోనే శుక్రవారం తెల్లవారుజామున మద్యం మత్తులో గుత్తి రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారం-1కి చేరుకున్నాడు. తన వైపుగా వస్తున్న రైల్వే పోలీసులను గమనించి వెంటనే పక్కనే ఉన్న గూడ్స్ రైలు ఇంజిన్‌పైకి ఎక్కాడు. పైనున్న విద్యుత్ లైన్ తగిలి షాక్‌కు గురై గాయపడ్డాడు. వీపు భాగం కాలిపోయింది. క్షతగాత్రుడిని వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ నాగప్ప తెలిపారు.

షరతులు వర్తిస్తాయి!

షరతులు వర్తిసాయి.. ఇదేదో వ్యాపార ప్రకటన అనుకుంటే పప్పులో కాలేసినట్టే.. ఎందుకంటే నేటితరం యువతులు పెళ్లి కోసం ముందుగానే షరతులు విధిస్తున్నారు. తాము చెప్పిన ఏ అంశంలోనైనా తేడా ఉంటే ఆ సంబంధాన్ని కాదనుకుంటున్నారు. ఉద్యోగ భద్రత.. ఆస్తులు.. ఆర్థిక వెసులుబాటుకు ప్రాధాన్యతనిస్తున్నారు. దీంతో పెళ్లి సంబంధాలు కుదరడం గగనమవుతోంది.

- పి.చైతన్య అనే అబ్బాయి అనంతపురంలోని ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. రూ.50 వేల వరకు జీతం. పార్ట్‌టైం బిజినెస్ చేసి నెలకు మరో రూ.30వేలు సంపాదిస్తున్నాడు. అయినా సరే 30 ఏళ్లు దాటినా పిల్లనిస్తామనే వారు లేరు. దీంతో చైతన్య టెన్షన్ అంతా ఇంతా కాదు.
- వెంకట్ అనే మరో కుర్రాడు మొబైల్ షాపు నిర్వహిస్తున్నాడు. నెలకు రూ.60వేలు సంపాదిస్తున్నాడు. ఇప్పటివరకూ చాలా సంబంధాలు చూశారు. కానీ అమ్మాయిలు పెట్టే డిమాండ్లకు అతను ఇబ్బంది పడుతున్నాడు. 30 ఏళ్లు దాటి 31లోకి వచ్చినా పెళ్లి కాలేదు.



వధువుల డిమాండ్ల జాబితా చాంతాడంత

- మంచి ప్యాకేజీతో ఉద్యోగం.. పొలమూ ఉండాలి
- డిమాండ్లకు సరితూగక ముందుకు సాగని పెళ్లిళ్లు
- మాఘ మాసంలోనూ అంతంతమాత్రంగానే వివాహాలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కాలం ఎప్పుడూ ఒకరిదే ఉండదు.. మాకంటూ ఒకరోజు వస్తుంది.. ఇది తరచూ వినే నానుడి. ఇప్పుడీ మాట అమ్మాయిలకు సరిగ్గా సరిపోతుంది. సరైన అబ్బాయి దొరక్క, దొరికిన అబ్బాయికి కట్నమిచ్చుకోలేక నానా తంటాలు పడే అమ్మాయిలు, వారి తల్లిదండ్రులు ఇప్పుడు పైచేయి సాధించారు. మాకు ఇలాంటి అబ్బాయే కావాలి, మాకు నచ్చినట్టే ఉండాలి, మేము చెప్పినట్టే వినాలి.. అంటూ గట్టిగా, సూటిగా చెబుతుండటంతో అబ్బాయిల మైండ్ బ్లాక్ అయినంత పనవుతోంది. ఓవైపు వయసు మీద పడుతున్నా అమ్మాయి దొరక్క అబ్బాయిలు పడుతున్న టెన్షన్ అంతా ఇంతా కాదు. వధువుల డిమాండ్లతో అబ్బాయిలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

మాఘమాసం వచ్చినా...

మాఘమాసంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇబ్బడి ముబ్బడిగా పెళ్లిళ్లు జరిగేవి. అమ్మాయిల తాజా డిమాండ్లతో అబ్బాయిలకు పెళ్లి ఒక పట్టాన అవడం లేదు. మ్యాట్రిమోని సంస్థలు, మ్యారేజీ బ్రోకర్లు, పేరయ్యలు, తెలిసిన వాళ్లు ఇలా ఎంతమందికి చెప్పినా అబ్బాయికి జోడీ దొరకడం కష్టమవుతోంది. నూరు అబద్ధాలాడైనా పెళ్లి చేయాలంటారు.. కానీ నూరు నిజాలు కుండబద్దలు కొట్టి అయినా సరే సరిజోడీ తెచ్చుకుంటాం అని అమ్మాయిలు ధైర్యంగా చెబుతున్న పరిస్థితులు ఉన్నాయి.

వధువు తరఫు డిమాండ్లివీ..



- నెలకు రూ.లక్ష దాకా జీతం ఉండాలి. సొంత ఇల్లు ఉండాలి.
- మంచి ప్యాకేజీ, సొంత ఇళ్లు ఉన్నా.. కొద్దో గొప్పో పొలం ఉండాలి.
- రెండుమూడేళ్ల కంటే వయసు గ్యాప్ ఉండరాదు. బట్టతల ఉంటే ఒప్పుకోం.
- ఉమ్మడి కుటుంబంలో ఉంటే గనుక ఇబ్బంది. పెళ్లవగానే వేరే కాపురం పెట్టాలి.
- వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులుంటే వాళ్లకు మేము సేవలు చేయలేం.
- ఆడపడుచులు ఎక్కువగా ఉన్న కుటుంబంలో వరుడైతే వద్దు.
- మేము ఎలాంటి నగదూ ఇవ్వలేం.. మా పిల్ల వరకూ బంగారం చేయించుకుంటాం.
- ఉమ్మడి ఆస్తులుంటే ఎంగేజిమెంటు అవగానే నీ పేరుమీదకు బదిలీ చేయించుకోవాలి.

పట్టింపులు ఎక్కువయ్యాయి



ఇటీవల అబ్బాయిలకు సంబంధం కుదిరిందంటే ఆశ్చర్యపోయే పరిస్థితి వచ్చేసింది. దానికితోడు మళ్లీ జాతకాలు, గ్రహరాశుల ప్రభావం, కుజదోషం వంటివి ఎక్కువవుతున్నాయి. ఎంత సర్దిచెప్పినా ఎక్కడో అసంతృప్తి ఉంటోంది. చాలా చోట్ల పెళ్లిళ్ల వేరే కారణాల వల్ల కంటే జాతకాల, శ్యాలరీ ప్యాకేజీ పట్టింపుల వల్ల కూడా ఆలస్యమైపోతున్నాయి. మా బంధువుల్లో అబ్బాయిలు పెళ్లిళ్ల కుదరక అలాగే మిగిలిపోతున్నారు.

– కొడేకండ్ల నాగభూషణ రావు, మూడవరోడ్డు, అనంతపురం

ప్యాకేజీ చుట్టూనే ఆలోచన



ఆడపిల్లల తల్లిదండ్రుల ఆలోచనలు విచిత్రంగా మారిపోతున్నాయి. తమకంటే అధిక స్థాయిలో ఉండాలనుకోవడం తప్పు కాదు. కానీ అబ్బాయి స్థితిగతులను చూడడం మానేసి అతనికొచ్చే శ్యాలరీ ప్యాకేజీ చుట్టూ ఆలోచనలుంటున్నాయి. ఇక పౌరోహిత్యం చేసే వాళ్లయితే దాదాపు వారికి ఆడపిల్లలు దొరకని పరిస్థితి వచ్చేసింది. దానికి తోడు ఆడపిల్లలు బాగా చదువుకుని సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడుతుండడంతో వారికి తగ్గ సంబంధాలు ఉండడం లేదు.

– బాలాజీ శర్మ, పురోహితుడు, అనంతపురం

కెరియర్‌కే ప్రాధాన్యం



రెండు దశాబ్దాల కిందటతో పోలిస్తే ఇప్పుడు వధూవరులు వేతనానికి ఇస్తున్న ప్రాధాన్యత ఇతరత్రా వాటికి ఇవ్వడం లేదు. ఆషామాషి ఉద్యోగాలు చేసేవారికి అమ్మాయి దొరకడం కష్టమైపోయింది. ఈడు జోడు, జాతకాలు ఇవన్నీ ఉంటూనే గొప్పగా ఉండాలన్న భావనతో పెరుగుతున్నారు. ఒకప్పుడు తల్లిదండ్రులు చూపించిన సంబంధం చేసుకునే వారు. కానీ ఇప్పుడలా కాదు. కోరికలు పెరిగిపోవడం, ఆడపిల్లలదే పైచేయి కావడంతో అబ్బాయిలు ఇబ్బందులు ఎదుర్కోక తప్పడం లేదు.

– బత్తలపల్లి సత్యరంగారావు, వధూవర పరిచయ వేదిక

యువత 'మత్తు' బారిన పడకూడదు



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో ఎస్పీ జగదీష్

అనంతపురం అర్బన్: యువత మత్తుబారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ జగదీష్‌తో కలిసి ఎన్‌సీఓఆర్‌డీ జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము నిర్వహిస్తున్న సామాజిక మాధ్యమ గ్రూపుల్లో ప్రభుత్వ పథకాలు, మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలు తదితర అంశాలపై సమాచారం ఉంటుదన్నారు. ఈ గ్రూపుల్లో అధికారులు భాగస్వాములై సమాచారాన్ని ఆయా శాఖలకు చెందిన లబ్ధిదారులకు చేరవేసి అవగాహన కల్పించాలని ఆదేశించారు. నాశ్‌ముక్త్ భారత్ అభియాన్ కింద జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డీ- అడిక్షన్ వార్డులో ఉద్యోగ ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. వసతి గృహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు సంబంధించి పూర్తి సమాచారాన్ని రెండు వారాల్లోగా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ ఎ.మలోల, ఆర్డీఓ కేశవ నాయుడు, డీటీ వీర్రాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని మోడల్ స్కూళ్లలో 2025–26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 24 నుంచి మార్చి 31 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. 5వ తరగతి స్థాయిలో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలలో పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు మోడల్ స్కూళ్లలో సంప్రదించాలని సూచించారు.

రైతులను పరామర్శించడం ఇల్లీగల్ యాక్టివిటా?

- పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో విఫలం
- ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత ధ్వజం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: రైతుల కష్టాలు తెలుసుకుని.. వారికి బాసటగా నిలిచేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెళ్లడాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇల్లీగల్ యాక్టివిటీ అంటూ వ్యాఖ్యానించడాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి తప్పుపట్టారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులను పరామర్శిస్తే మాజీ సీఎంతో పాటు వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కేసులు నమోదు చేయడమేంటని ప్రశ్నించారు. ఖరీఫ్ సీజన్ నుంచి పండిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రాష్ట్రంలో రైతుల పరిస్థితి దారుణంగా తయారైందన్నారు. విత్తనాలు, ఎరువులు, తదితర ధరలు పెరగడంతో పాటు కంది, శనగ, మొక్కజొన్న, ధాన్యం, రాగులు, పత్తి, అరటి తదితర పంటలకు గిట్టుబాటు ధర లేక అమ్ముకోలేని దయనీయ పరిస్థితి నెలకొందన్నారు. గిట్టుబాటు ధర లభించకపోతే పోటీ మార్కెట్‌ను తీసుకురావాల్సిన ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు. గతంలో 24 పంటలకు గిట్టుబాటు ధర లభించకపోతే అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే కొనుగోలు చేసేలా తీసుకున్న చర్యలను ఆయన గుర్తు చేశారు. పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించకపోతే తర్వాత జరగబోయే పరిణామాలకు పూర్తి బాధ్యత వహించాలని హెచ్చరించారు.

ప్రభుత్వ తీరు దారుణం

మిర్చి రైతుల్లో మనోధైర్యాన్ని నింపేందుకు గుంటూరు మిర్చి యార్డుకు వెళ్లిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్ల కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దారుణమని అనంత మండిపడ్డారు. రాజ్యాంగబద్ధంగా ఒక మాజీ సీఎంకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతుల కష్టాలను తెలుసుకునేందుకు ప్రజాస్వామ్య పద్ధతిలో మాజీ సీఎం వెళితే అక్కడ ఆయనకొచ్చిన విశేషమైన ప్రజాదరణను ఓర్వలేక సీఎం చంద్రబాబు, ప్రజాప్రతినిధులు విమర్శలు చేయడం సరికాదన్నారు.

రైతుల భూములు వేలం వేస్తారట!

అనంతపురం జిల్లాలో సెంట్రల్ బ్యాంకులు రుణాలు చెల్లించాలంటూ రైతులకు నోటీసులు జారీ చేయడం విస్మయానికి గురి చేస్తోందని అనంత పేర్కొన్నారు. బ్యాంకులో తీసుకున్న రుణాలకు సంబంధించి భారీ మొత్తంలో చెల్లించాలంటూ అధికారులు పంపిన నోటీసును ఆయన విలేకరులకు చూపించారు. వన్‌టైం సెటిల్‌మెంట్ కూడా లేకుండా డబ్బులు కట్టకపోతే భూములు వేలం వేస్తామని రైతులకు నోటీసులు పంపడం సరికాదన్నారు. ఇలాంటి వాటిని ప్రభుత్వం నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

చిన్న పాపపై ట్రోల్ చేయడం ఏంటి?

అభిమానంతో ఓ చిన్నారి మాజీ సీఎం వైఎస్ జగన్‌వద్దకు వెళ్లి అమ్మఒడి ప్రస్తావన తెస్తే దాన్ని టీడీపీ సోషల్ మీడియా ట్రోల్ చేయడాన్ని అనంత వెంకటరామిరెడ్డి తప్పుబట్టారు. ఇంత కన్నా దిగుజారుడు రాజకీయాలు ఎక్కడా చూడలేదన్నారు. టీడీపీ సైకోల వికృత చేష్టలను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎందుకు ఖండించడం లేదని నిలదీశారు. తెనాలిలో జగనన్న కాలనీలో పట్టా అందుకున్న మహిళ తన ఆనందాన్ని పంచుకుంటే.. అప్పట్లోనే టీడీపీ నాయకులు సోషల్ మీడియా వేదికగా అసభ్యకరంగా వేధింపులకు గురి చేయడంతో.. ఆమె ఆత్మహత్య చేసుకుందని గుర్తు చేశారు. ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, ఉమ్మడి మదన్ మోహన్‌రెడ్డి, గోగుల రాధాకృష్ణ, అమర్‌నాథ్‌రెడ్డి, పుల్లయ్య, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభద్రతలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

- 'ఆప్కాస్' రద్దు యోచనలో సర్కారు
- తమ అనుయాయులను నియమించాలని ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు
- ప్రైవేట్‌కు అప్పగిస్తే నష్టపోతామంటున్న చిరుద్యోగులు

అనంతపురం: కూటమి ప్రభుత్వ తీరుతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీవితాలు డోలాయమానంలో పడ్డాయి. ఎంతో సౌలభ్యంగా ఉన్న 'ఆప్కాస్'ను రద్దు చేసి ప్రైవేటుకు అవుట్‌సోర్సింగ్ విధానాన్ని కట్టబెట్టాలని ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటుండటంతో ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జేఎన్‌టీయూ అనంతపురం వర్సిటీని 2008లో దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఏర్పాటు చేశారు. అప్పట్లోనే అవుట్‌సోర్సింగ్ కింద 400 మందికి ఉద్యోగాలు కల్పించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆప్కాస్ కిందకు అవుట్‌సోర్సింగ్ వారిని తెచ్చి.. జీతాలు నేరుగా ప్రభుత్వమే చెల్లించేలా చర్యలు చేపట్టారు. అయితే, ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా నియామకాలు చేపట్టాలని ఇటీవల కూటమి సర్కారు నిర్ణయించడంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో అభద్రత నెలకొంది. ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగుల స్థానంలో తమ అనుచరులను నియమించాలంటూ పలువురు ప్రజాప్రతినిధులు నేరుగా సీఎంకు లేఖలు రాస్తుండటంతో మరింత ఆందోళన చెందుతున్నారు. ఆప్కాస్‌ను రద్దు చేస్తే తమ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఉద్యోగులు వాపోతున్నారు. గతంలో ప్రైవేట్ ఏజెన్సీల నిర్వహణలో సకాలంలో జీతాలు రాక ఇబ్బందులు పడిన సందర్భాలను గుర్తు చేస్తున్నారు.

ఉద్యమాలకు కార్యాచరణ..

జేఎన్‌టీయూ అనంతపురం ఉద్యోగులపై కొందరి ప్రజా ప్రతినిధుల కన్ను పడినట్లు తెలిసింది. ఏజెన్సీనే తమకు అప్పగించాలని ఉన్నత స్థాయిలో ఒత్తిడి తెస్తున్నారు. ఈ క్రమంలోనే ఆప్కాస్‌ను రద్దు చేయాలని మంత్రి వర్గ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలనే డిమాండ్‌తో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉద్యమాలకు కార్యాచరణ రూపొందించారు. జీఓ నంబర్ 2ను సవరించి అన్ని డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలనే డిమాండ్లతో ఈ నెల 24న సీఎం, విద్యాశాఖ మంత్రికి మెయిల్స్ ద్వారా వినతిపత్రాలు పంపనున్నారు. మార్చి 10న కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగ సంఘాలు ప్రకటించాయి.

జీతాలు కూడా లేవు..


గత ఏడాది అక్టోబర్ వరకు జేఎన్‌టీయూ అనంతపురం (జేఎన్‌టీయూ-ఏ) అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఆప్కాస్ నుంచి జీతాలు అందాయి. ఆ తర్వాత జీతాలు చెల్లించలేదు. ఈ క్రమంలో ప్రభుత్వ తాజా నిర్ణయం మేరకు ఏజెన్సీకి అప్పగించిన అనంతరమే జీతాలు ఇస్తారా అనే అంశంపై కూడా స్పష్టత రావాల్సి ఉంది.

ఆప్కాస్‌తో ఉద్యోగ భద్రత:

చిరుద్యోగులకు ఉద్యోగ భద్రత ఉండాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆప్కాస్ అనే వ్యవస్థను ఏర్పాటు చేసింది. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఈ వ్యవస్థ కిందకు తెచ్చి నేరుగా ప్రభుత్వమే జీతాలు చెల్లించేది. ఈఎస్‌ఐ, పీఎఫ్ వెసులుబాటు కల్పించింది. ఆప్కాస్‌లో విధులు నిర్వహిస్తున్న వారిని తొలగించాలంటే అందుకు బలమైన కారణాలు ఉండాలి. మూడు సార్లు షోకాజ్ నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. సదరు ఉద్యోగి ఇచ్చే జవాబు సంతృప్తికరంగా ఉన్నట్లయితే ఆ ఉద్యోగిని కొనసాగించాల్సి ఉంటుంది. ఆప్కాస్ కాకుండా ఏజెన్సీ ద్వారా ఇస్తే జీతాలు ఎప్పుడు చెల్లిస్తారో తెలియదు.

పకడ్బందీగా గ్రూప్-2 మెయిన్స్

- జేసీ శివ్ నారాయణ్ శర్మ ఆదేశం



మాట్లాడుతున్న జేసీ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఈ నెల 23న గ్రూప్-2 మెయిన్స్ రాత పరీక్షలు అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని పరీక్షల కో–ఆర్డినేటింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై జేసీ శుక్రవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో డీఆర్‌ఓ ఎ.మలోల, ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రెటరీ ఎస్ఎన్ షరీఫ్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం సెషన్లుగా జరగనున్న పరీక్షలకు 7,293 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. పరీక్ష నిర్వహణలో ఏపీపీఎస్సీ నిబంధనలు తప్పక పాటించాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని జేసీ శివ్ నారాయణ్ శర్మ సూచించారు. ఉదయం పరీక్షకు 9.45 గంటల తరువాత, మధ్యాహ్నం జరిగే పరీక్షకు 2.45 గంటల తరువాత కేంద్రంలోకి అనుమతించబోరన్నారు.

చిట్స్ నిర్వాహకుల ఆస్తుల అటాచ్

అనంతపురం: చిట్స్ పేరిట డబ్బు వసూలు చేసి.. తిరిగి సభ్యులకు చెల్లించకుండా తాత్సారం చేసిన నిర్వాహకుల ఆస్తులను అటాచ్ చేశారు. నగరానికి చెందిన నజీర్ బాషా, జరీనా, దాదు అఫ్రిది, మహమ్మద్ రఫీ ఒకే కుటుంబానికి చెందిన వారు. వీరు చిట్స్ పేరుతో 108 మంది నుంచి రూ.8 కోట్లకు పైగా నగదు వసూలు చేశారు. నిర్దేశిత కాలం పూర్తయినా సభ్యులకు తిరిగి చెల్లించలేదు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో చిట్స్ నిర్వాహకులపై కేసు నమోదైంది. కలెక్టర్, ఎస్పీ నివేదిక ఆధారంగా నిర్వాహకుల ఆస్తులను అటాచ్ చేయాలని జిల్లా కోర్టు ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర హోంశాఖ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. నజీర్ బాషా కుటుంబ సభ్యుల ఆస్తులన్నీ అటాచ్ చేశారు. తదుపరి ఉత్తర్వులొచ్చే వరకు ఆస్తి అమ్మకం, నగదు లావాదేవీలు జరపడానికి వీల్లేదని పేర్కొన్నారు.


వైభవంగా ధ్వజారోహణం

బుగ్గలో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



పార్వతీ సమేత రామలింగేశ్వరుడికి అగ్ని నివేదన

తాడిపత్రి రూరల్: పట్టణంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం బుగ్గరామలింగేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం సాయంత్రం ధ్వజారోహణంతో మహా శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. నందీశ్వరుని చిత్ర పటానికి అర్చకులు ప్రత్యేక పూజలు చేసి.. ఎగురవేశారు. అంతకు మునుపు బుగ్గరామలింగేశ్వర స్వామి మూలవిరాట్‌కు అగ్ని నివేదన చేశారు. అక్కడి నుంచి అగ్నిని ఊరేగింపుగా హోమశాలకు తీసుకువచ్చారు. అక్కడ సంప్రదాయ పద్ధతిలో పూజలు చేశారు. ఉదయం గణపతి పూజ, అగ్ని మదనం, వాస్తు బలి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకొని పార్వతీ సమేత బుగ్గ రామలింగేశ్వర స్వామిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



నంది చిత్ర పటానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



క్లుప్తంగా

లైనింగ్ పనులు ఆపండి

- టీడీపీ నాయకుడి వేడుకోలు


టీడీపీ నాయకుడు ఎర్రిస్వామి

రాప్తాడు రూరల్: హంద్రీ–నీవా కాలువ రెండో దశలో ప్రభుత్వం చేపట్టిన కాంక్రీట్ లైనింగ్ పనులపై టీడీపీ శ్రేణుల నుంచి కూడా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇందులో భాగంగా ఆత్మకూరు మండలం సిద్ధరాంపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, రైతు ఎర్రిస్వామి సోషల్ మీడియా వేదికగా పోస్టు చేసిన వీడియో వైరల్ అవుతోంది. ఆయన మాటల్లోనే...'హంద్రీ–నీవా కాలువ లైనింగ్ ప్రారంభమయ్యాయి. స్టేజ్–2 కింద మా ఊరి వద్ద పనులు చేస్తున్నారు. ఈ లైనింగ్ పనులు చేపడితే మా గ్రామంలోనే వేలాది ఎకరాల్లో లక్షల సంఖ్యలో చీనీ చెట్లు ఎండిపోతాయి. చంద్రబాబు సార్..చేతులెత్తి వేడుకుంటున్నా లైనింగ్ పనులు ఆపండి. లేదంటే వేలాదిమంది రైతులు నష్టపోతారు. లైనింగ్ పనులు పూర్తయితే మా భూములన్నీ ఎండిపోతాయి. అసలే బండ భూములివి, ఎక్కడో ఒకచోట మాత్రమే నీళ్లు పడతాయి. లైనింగ్ వేస్తే అవికూడా లేకుండా పోతాయి. దయచేసి లైనింగ్ పనులు ఆపి మమ్మల్ని కాపాడండి' అంటూ వేడుకున్నాడు.

నేడు 'మోడల్' టీచర్లకు 'పీఏఎల్' శిక్షణ

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని ఏపీ మోడల్, కేజీబీవీ టీచర్లకు పర్సనలైజ్డ్ అడాప్టివ్ లర్నింగ్ (పీఏఎల్) అంశంపై శనివారం రాప్తాడులోని మోడల్ స్కూల్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని 53 పాఠశాలల్లో ఇప్పటికే పీఏఎల్ కార్యక్రమం అమలులో ఉంది. విద్యార్థుల వ్యక్తిగత సామర్థ్యాన్ని గుర్తించి, వారి అభ్యసనా విధానాన్ని మరింత మెరుగు పరచాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మొదటి దశలో 32 కేజీబీవీ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, గణితం, ఇంగ్లిషు, తెలుగు ఉపాధ్యాయులు ఈ ఏడాది జనవరి 3న శిక్షణ పొందారు. రెండో దశలో భాగంగా ప్రస్తుతం 15 మోడల్ స్కూళ్లు, ఆరు రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, గణితం, ఇంగ్లిషు, తెలుగు ఉపాధ్యాయులకు శనివారం శిక్షణ ఇవ్వనున్నారు. సంబంధిత ప్రిన్సిపాళ్లు, టీచర్లు విధిగా హాజరు కావాల్సి ఉంటుంది.

ఏటీఎం కార్డు తస్కరించి.. రూ. 51 వేలు స్వాహా

- కేసు నమోదుకు సహకరించని గుత్తి పోలీసులు

గుత్తి: వృద్ధుడిని ఏమార్చి ఆయన ఏటీఎం కార్డు ద్వారా రూ.51 వేలను అపహరించిన ఘటన గుత్తిలో వెలుగుచూసింది. వివరాలు.. గుంతకల్లు మండలం గొల్లలదొడ్డికి చెందిన వృద్ధుడు తలారి రామాంజనేయులు శుక్రవారం రాత్రి రూ.5 వేలు డ్రా చేయడానికి గుత్తి లోని ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద ఉన్న ఏటీఎం కేంద్రానికి చేరుకున్నాడు. అయితే నగదు డ్రా చేసే విధానం తెలియక నిలబడి ఉండడం గమనించిన ఓ ఆగంతకుడు నగదు డ్రా చేసిస్తానంటూ ఏటీఎం కార్డు తీసుకుని ప్రయత్నించాడు. అయితే డబ్బు డ్రా కావడం లేదంటూ అప్పటికే తన వద్ద సిద్ధంగా ఉంచుకున్న మరో ఏటీఎం కార్డును వృద్ధుడికి అందజేసి వెళ్లిపోయాడు. కాసేపటి తర్వాత తన బ్యాంక్ ఖాతా నుంచి రూ. 51 వేలు డ్రా అయినట్లు వృద్ధుడి సెల్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో తాను మోసపోయినట్లుగా నిర్ధారించుకున్న వృద్ధుడు పోలీసులను ఆశ్రయిస్తే ఫిర్యాదు సైతం తీసుకోకుండా వెనక్కు పంపారు. 'నీది గుంతకల్లు మండలం కావడంతో అక్కడికెళ్లి కంప్లెయింట్ ఇవ్వాలని' పోలీసులు చెబుతున్నారంటూ విలేకరుల ఎదుట వృద్ధుడు వాపోయాడు.



అభిరుచులు ఒక్కటే

అనంతపురం నగరానికి చెందిన మల్లికార్జునరెడ్డి, రాధ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వీరికి ఓ బాబు తర్వాత 2012లో కవలలు జన్మించారు. సాయి సహస్ర, సాయి సమన్వి అని పేర్లు పెట్టారు. పెరుగుతున్న కొద్దీ కాసింత పోలికలు వేరైనా అభిరుచులు, ఇష్టాలు మాత్రం ఒక్కటేనని తల్లిదండ్రులు అంటున్నారు.

సందర్భం — నేడు ప్రపంచ కవలల దినోత్సవం

అచ్చం.. అలాగే!

- అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్న కవలలు
- ఒకే పోలికతో తికమక పెట్టిన సందర్భాలు అనేకం

అనంతపురం కల్చరల్/ఎడ్యుకేషన్/గుత్తి రూరల్ : ఒకే పోలిక.. ఒకే డ్రెస్. అచ్చం ఒకరిని చూస్తే మరొకరిని చూసినట్లే! జిరాక్స్ టూ జిరాక్స్... ఇలా చెప్పుకుంటూ పోతే కవలల గురించి ఎన్నో అంశాల్ని పోల్చి చెప్పినా తక్కువే అవుతుంది. తల్లిగర్భంలో ఒకేసారి, ఒకే రూపంతో మొదలై.. క్షణాల వ్యవధిలో బయటి ప్రపంచానికి పరిచయమై.. ఒకే ముఖకవళికలతో అందరినీ అమితంగా ఆకట్టుకోవడం కవలల ప్రత్యేకత. ముద్దులొలికే పసికందులను చూడగానే వారి పేర్లను కూడా దరిదాపు ఒకేలా పెట్టేయడం పరిపాటిగా మారింది. రామయ్య.. లక్ష్మయ్య, రమేష్.. నరేష్, జలజ.. శైలజ... లాంటి పేర్లతోనూ తికమక పట్టించేస్తుంటారు. నేడు ప్రపంచ కవలల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సాక్షి' ప్రత్యేక కథనం.

సైన్స్ ఏమి చెబుతోందంటే..

సృష్టి లోని ఎన్నో వింతలు, అద్భుతాల్లో కవలల జననం కూడా ఒకటిగా ఉంటోంది. బాగా తెలిసిన వారు సైతం కవలలను ఎవరెవరో పోల్చుకోవడం కాస్త ఇబ్బందిగానే ఉంటుంది. ఫలదీకరణ సమయంలో వచ్చే మార్పుల కారణంగా కవలల జననం సంభవిస్తుందని వైద్య నిపుణులు అంటున్నారు. ప్రత్యుత్పత్తి ప్రక్రియలో అండం ఏర్పడిన తర్వాత శుక్రకణం రెండుగా విడిపోయి జన్మించిన కవలలను మోనోజైగోటిక్ లేదా యూని ఓవిలార్ ట్విన్స్ అంటారు. వీరిలో ఇద్దరూ ఆడ లేదా, మగ అయి ఉంటారు. వీరికి చాలా దగ్గర పోలికలుంటాయి. రెండు శుక్ర కణాలు ఏర్పడి జన్మించే కవలలను 'డై జైగోటిక్ లేదా బైనోవిలార్ ట్విన్స్' అంటారు. వీరిలో ఒకరు ఆడ, మరొకరు మగ అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

కవలల దినోత్సవ ఆవిర్భావమిలా.

ప్రథమంగా కవలల దినోత్సవాన్ని పోలెండు దేశస్థులు 1976లో నిర్వహించారు. మోజెస్, విల్‌కాక్స్ అనే కవల సోదరులు తాము నివసిస్తున్న ఊరికి 'ట్విన్స్ బర్గ్' అని పేరుపెట్టుకున్నారు. కవలలనే పెండ్లాడి, మళ్లీ కవలలకే జన్మనిచ్చారు. దురదృష్టమైన విషయమేమంటే ఒకే రకమైన వ్యాధి సోకి వారిద్దరూ ఒకే రోజు మరణించారు. వీరి గుర్తుగా ప్రతి ఫిబ్రవరి 22న ప్రపంచ కవలల దినం జరపడం పరిపాటిగా మారింది.

మంచి స్నేహితుల్లా



అనంతపురం నగరానికి చెందిన కవలలు సందీప్, సంతోష్ చిన్నప్పటి నుంచి మంచి స్నేహితుల్లా పెరిగారు. చదువుతో పాటు ఆటల్లోనూ పోటీపడేవారు. 2001లో జన్మించారు ప్రస్తుతం సందీప్ ఐఐటీ మద్రాసులో ప్రాజెక్టు అసోసియేట్‌గా, సంతోష్ హైదరాబాదులోని ఐసీఐసీఐ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నారు. తల్లిదండ్రులు చిదానందమూర్తి, నిర్మల మాట్లాడుతూ దూరంగా ఉండడం ఇష్టం లేకపోయినా అవకాశాల దృష్ట్యా వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నారని ఒకే ఆలోచనలతో ఉండడం వీరి ప్రత్యేకతగా చెప్పుకొచ్చారు.

ఇద్దరూ ఇద్దరే..



తాడిపత్రి పట్టణానికి చెందిన షేక్.నాజియా, షేక్.బాబా ఫక్రుద్దీన్ దంపతుల పిల్లలు మన్నత్ అఫ్రా, మన్నత్ అష్మరాను చూస్తే ఎవరు ఎవరో గుర్తు పట్టడం చాలా కష్టం. ఇద్దరూ మొంటి ఘటాలే. డ్రస్సులు, ఆభరణాలు ఏది కొన్నా ఇద్దరికీ ఒకేలా ఉండాలి. భోజనం, అల్పాహారం కూడా సేమ్ టు సేమ్ ఉండాలి. లేకపోతే గొడవ చేసేస్తారు. ఇద్దరూ ఒకేసారి అస్వస్థతకు గురవుతుంటారు. ఏ పని చేసినా ఇద్దరు ఒకేలా చేస్తారు.

బయటవాళ్లు పోల్చుకోలేరు



అనంతపురం నగరానికి చెందిన చెన్నారెడ్డి, హేమలత దంపతుల పిల్లలు రాహిత్య, రిత్వికను రోజూ చూస్తున్న వారు తప్ప ఇతరులు పోల్చుకోవడం చాలా కష్టం. చిన్నప్పుడు స్కూల్‌లోనూ అలాగే జరిగేదని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

ఆరోగ్యం ఇద్దరికీ ఒకేలా..



అనంతపురంలోని కృపానందనగర్‌లో నివాసముంటున్న జిలాన్ బాషా, ఫక్రున్నీసా దంపతుల పిల్లలు బుష్రా, జిక్రా ఇష్టాయిష్టాలు వేర్వేరుగా ఉన్నాయి. బుష్రా ఆటలు, చదువులో రాణిస్తోంది. జిక్రాకు దైవప్రార్థనలపై ఆసక్తి ఎక్కువ. ఏ డ్రస్సు కొన్నా ఒకే డిజైన్ లేకపోతే భలే గొడవ చేసేస్తారని, ఒకరికి ఆరోగ్యం బాగాలేకపోతే మరొకరు ఇబ్బంది పడడం ప్రతిసారీ జరుగుతోందని తల్లిదండ్రులు అంటున్నారు.

ఇద్దరూ పోటాపోటీ



కదిరి నియోజకవర్గం గాండ్లపెంట మండలం తాళ్ల కాల్వకు చెందిన ఉపాధ్యాయుడు గంగాధర్ రెడ్డి, రాణి దంపతుల కవల పిల్లలు చిర్రపు శశిధర్ రెడ్డి, చిర్రపు మహిధర్ రెడ్డి. వీరు చిన్నప్పటి నుంచి చదువులో తొలి రెండు స్థానాల్లో నిలిచేవారు. ఇందు కోసం పోటాపోటీగా చదువుకునేవారు. ప్రస్తుతం ఇద్దరూ బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నారు. ఎన్ఐటీ – వరంగల్‌లో శశిధర్‌రెడ్డి, ఎన్ఐటీ – సిల్చార్‌లో మహిధర్‌రెడ్డి చదువుతున్నాడు.

ప్రయాణికుల భద్రతకు చర్యలు

- ఏపీ రైల్వేస్ ఐజీపీ కేవీ మోహన్‌కుమార్


మాట్లాడుతున్న మోహన్‌కుమార్ (చిత్రంలో) జీఆర్‌పీ ఎస్పీ రాహుల్‌మీనా, డీఎస్పీ హర్షిత

గుంతకల్లు: రైలు ప్రయాణికుల భద్రతతో పాటు నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీ రైల్వేస్ ఐజీపీ కేవీ మోహన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులతో స్థానిక డీఆర్‌ఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కో-ఆర్డినేషన్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జీఆర్‌పీ ఎస్పీ రాహుల్‌మీనా, డీఎస్పీ హర్షిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రానున్న వేసవిలో రైళ్లలో చోరీలు ఎక్కువగా జరిగే అవకాశముందని, గుంతకల్లు డివిజన్‌కు సమీపంలోని సరిహద్దున ఉన్న కర్ణాటక, తెలంగాణ, చెన్నై రాష్ట్రాల సిబ్బందితో కలసి నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహారాష్ట్ర, జార్ఖండ్, బిహార్ తదితర ప్రాంతాల నుంచి కొన్ని గ్యాంగ్‌లు రైళ్లలో ప్రయాణిస్తూ చోరీలు చేసి వెంటనే పక్క రాష్ట్రాలకు ఉడాయిస్తుంటారన్నారు. దీంతో పక్క రాష్ట్రాల సిబ్బందిని కో-ఆర్డినేషన్ చేసుకోగలిగితే దొంగలను పట్టుకోవడం సులువవుతుందన్నారు. పెరిగిన ఎక్స్‌ప్రెస్ రైళ్ల సంఖ్యకు అనుగుణంగా రైల్వే పోలీసులతో పాటు లోకల్ పోలీసుల సాయాన్ని కూడా తీసుకుంటామన్నారు. సమస్యాత్మక రైలు మార్గాలపై ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీలో ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే ఔట్‌సోర్సింగ్ కింద తాత్కాలిక సిబ్బంది నియమించుకుంటామన్నారు. అంతకు ముందు ఆయన జీఆర్‌పీ ఎస్పీ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన బెల్ ఆఫ్ ఆర్మ్స్, గార్డు రూమ్‌లను ప్రారంభించారు. ప్రాంగణంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో జీఆర్‌పీ డీఎస్పీ మురళీధర్ (నెల్లూరు), సీఐ అజయ్‌కుమార్, డివిజన్ పరిధిలోని జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

నమ్మి ఓటేస్తే.. రైతుల నోట మట్టి కొడతారా?

- జిల్లా రైతులను కాదని చిత్తూరు జిల్లాకు నీళ్లు తీసుకెళతామంటే ఒప్పుకోం
- పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకు రావడంలో ఎమ్మెల్యే సునీత వైఫల్యం
- నేటి నుంచి గ్రామాల పర్యటన
- అఖిల పక్ష నేతలతో చర్చించి లైనింగ్ పనులు అడ్డుకుంటాం
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు రూరల్: నమ్మి ఓటేసిన పాపానికి జిల్లా రైతుల నోట కూటమి సర్కార్ మట్టి కొడుతోందని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హంద్రీ–నీవా కాలువ లైనింగ్ పనులు ఆపాలని పార్టీలకు అతీతంగా రైతులు స్పందిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా ఎక్కడికక్కడ జంగిల్ క్లియరెన్స్ పనులను అడ్డుకుంటున్నారన్నారు. కాలువకు కాంక్రీట్ లైనింగ్ వేస్తే దాదాపు 20 కిలోమీటర్ల దూరం వరకు భూగర్భ జలాలు అడుగంటి పంటల సాగుపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. బోర్లు ఎండిపోయి రైతులు వలస వెళ్లే పరిస్థితులు నెలకొంటాయన్నారు. ఈ విషయంగా గతంలో పలు విజ్ఞప్తులు చేసినా కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. రైతు సంక్షేమానికి పార్టీలకు అతీతంగా టీడీపీ, బీజేపీ, జనసేన, కమ్యూనిస్టు పార్టీల నేతలు, రైతు సంఘాలు, రైతు కూలీలు, నాయకులు అందరూ కలిసికట్టుగా పోరాడదామని పిలుపునిచ్చారు. ఇందు కోసం శనివారం నుంచి హంద్రీ–నీవా ప్రాజెక్ట్ పరిధిలోని గ్రామాల్లో పర్యటించి అఖిల పక్ష నేతలతో చర్చించి, ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామన్నారు. లైనింగ్ పనులను అడ్డుకునేందుకు ఎవరు వచ్చినా కలుపుకొని పోరాటాలు చేస్తామన్నారు. శ్రీశైలం డ్యాంలో 80 టీఎంసీల వరకు నీళ్లు ఉన్నాయని, రోజూ సగటున ఇరు రాష్ట్రాలు అర టీఎంసీ మాత్రమే డ్రా చేస్తున్నాయన్నారు. ఈ లెక్కన మరో ఐదు నెలల వరకు వాడుకోవచ్చన్నారు. ఈ లోపు మడకశిర బ్రాంచ్ కెనాల్ కింద ఉన్న చెరువులు, పేరూరు డ్యాంకు కూడా నీరు ఇవ్వొచ్చన్నారు. జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు ఆ దిశగా ఎందుకు ఆలోచించడం లేదో అర్థం కావడం లేదన్నారు. పెన్నానదిలో ఇసుకను తోడుకునే విషయంలో ఉన్న ఉత్సాహం పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకురావడంలో పరిటాల సునీత చూపించడం లేదన్నారు. తన నియోజకవర్గంలో చెరువులకు నీళ్లివ్వాలని అడగాల్సిన పెద్దమనిషి బాలకృష్ణ సైతం నియోజకవర్గ ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసి తిరుగుతున్నారన్నారు. పెనుకొండ నియోజకవర్గంలో చెరువులకు నీళ్లు తెచ్చుకునే విషయంలో మంత్రి సవితమ్మ మాట్లాడాలన్నారు. కొత్తగా వచ్చిన ఎంఎస్ రాజు మడకశిర నియోజకవర్గంలోని అగళి, అమరాపురం డిస్ట్రిబ్యూటరీలు పూర్తి చేసేందుకు రూ. 200 కోట్ల నిధులను ప్రభుత్వం నుంచి రాబట్టుకునేందుకు ప్రయత్నించాలన్నారు. జిల్లా రైతులను కాదని చిత్తూరు జిల్లాకు నీళ్లు తీసుకుపోవాలని చూస్తే అడ్డుకుంటామన్నారు. హంద్రీ–నీవా ప్రాజెక్ట్‌ను అనంతపురం, కర్నూలు జిల్లాలకే పరిమితం చేయాలన్నారు. ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సైతం దీనిపై స్పందించాలన్నారు. మైక్రో ఇరిగేషన్ లేదా పిల్లకాలువల నిర్మాణాలు పూర్తయిన తర్వాత లైనింగ్ పనులు చేసుకోవాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రామగిరి మండల కన్వీనర్ మీనుగ నాగరాజు, నాయకులు ఆదిరెడ్డి, మదిగుబ్బ వీరాంజనేయులు పాల్గొన్నారు.

అధికారుల అలసత్వం... ఆర్టీసీకి నష్టం

- గుత్తి డిపోలోని అక్రమాలు మరవకనే మరో రూ.46 లక్షల వ్యవహారం బట్టబయలు

అనంతపురం క్రైం: అధికారుల అలసత్వం కారణంగా ఆర్టీసీకి నష్టాలు చేకూరుతున్నాయి. డిపోలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో పరిస్థితి మరీ దారుణంగా మారింది. టోల్‌గేట్ చెల్లింపులకు సంబంధించి గుత్తి డిపోలో చోటు చేసుకున్న అక్రమాలు మరువకనే తాజాగా మరో ఘటన వెలుగు చూసింది.

రూ.46 లక్షల ఆదాయానికి గండి

ఉరవకొండ ఆర్టీసీ డిపో నుంచి రోజూ 25 బస్సులు జల్లిపల్లి టోల్‌ప్లాజా మీదుగా 104 ట్రిప్పులు తిరుగుతాయి. ఇందుకు గాను ఒక్క బస్సుకు టోల్ ఫీజు సింగిల్ ట్రిప్పు కింద రూ.235 చెల్లించాల్సి ఉంది. ఈ లెక్కన రోజుకు 104 ట్రిప్పులకు గాను రూ.24,440 చెల్లించాల్సి వస్తుంది. అయితే ఆర్టీసీ అధికారులు లోకల్ కన్సెక్షన్ తీసుకుంటే టోల్‌ఫీజులో రాయితీ వర్తిస్తుంది. ఒక్కో ట్రిప్పుకు రూ.110 మాత్రమే చెల్లించే అవకాశం ఉంది. అయితే ఈ అవకాశాన్ని అధికారులు కావాలనే నిర్లక్ష్యం చేసినట్లుగా తెలుస్తోంది. ఈ కారణంగా 2022 నుంచి 2024 ఆగస్టు వరకు నెలకు రూ.3.90 లక్షలు చొప్పున అప్పటి ఉరవకొండ డిపో మేనేజర్ గండి కొట్టారు. జల్లిపల్లి టోల్‌ప్లాజాకు ఆర్టీసీ ఖాతా నుంచి సకాలంలో సొమ్మును బదిలీ చేయని కారణంగా అది తడిసి మోపెడై రూ.46 లక్షలకు చేరుకుంది. ఈ వ్యవహారం తన తలకు ఎక్కడ చుట్టుకుంటుందోనని భావించిన ఆ డీఎం వెంటనే తన ఉద్యోగానికి వీఆర్‌ఎస్ ఇచ్చి వెళ్లిపోయినట్లు విశ్వసనీయ సమాచారం. అక్రమాలు జరిగాయని తెలిసినా సదరు అధికారిపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. పైగా ఈ విషయం వెలుగులోకి రాకుండా తొక్కిపెట్టారు. రూ.100 విలువ చేసే లీటరు డీజిల్ వృథాకాకుండా డ్రైవరుకు శిక్షణ పేరుతో 24 గంటల పాటు ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చే ఆర్‌ఎం స్థాయి అధికారులు.. డిపో అధికారి నిర్లక్ష్యం కారణంగా రోజుకు రూ.13 వేలు నష్టపోయామనే విషయాన్ని గ్రహించలేకపోవడం సంస్థ దౌర్భాగ్యమని యూనియన్ నేతలు మండిపడుతున్నారు.

గుత్తిలో జరిగింది వాస్తవం


గుత్తి డిపోలో అక్రమాలు చోటు చేసుకున్న మాట వాస్తవం. ఇందుకు సంబంధించిన ఉద్యోగిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయి. అయితే ఉరవకొండ డిపోలో ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోలేదు.

– సుమంత్.ఆర్.ఆదోని, ఆర్టీసీ ఆర్‌ఎం, అనంతపురం

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

జిల్లా సరిహద్దుతో పాటు, గార్లదిన్నె మండలంలో చోటు చేసుకున్న ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తాపడిన ఘటనలో 20 మంది భక్తులు గాయపడగా... పొట్ట కూటి కోసం కూలి పనులు ముగించుకుని ఇంటికి వెళుతున్న వ్యవసాయ కూలీలు 11 మంది మరో ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు.

గుత్తి రూరల్: అనంతపురం నగరానికి చెందిన ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు పుణ్యక్షేత్రాల సందర్శనకు ఈ నెల 6న బయలదేరింది. కాశీ, ఉజ్జయిని, పండరీపురం, షిర్డీ, నాసిక్‌తో పాటు పలు క్షేత్రాలను సందర్శించిన భక్తులు ఈ నెల 15న కుంభమేళా నుంచి బయలుదేరారు. గురువారం మంత్రాలయానికి చేరుకుని రాత్రికి అక్కడే బస చేశారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు మొత్తం 48 మంది భక్తులతో బయలుదేరిన బస్సు... ఆదోని, పత్తికొండ మీదుగా గుత్తికి వస్తుండగా కర్నూలు జిల్లా జొన్నగిరి గ్రామ శివారులో ముందు టైర్ పేలడంతో అదుపు తప్పి రోడ్డు పక్కన పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఘటనలో అనంతపురానికి చెందిన బస్సు డ్రైవర్ వినోద్‌కుమార్, వన్నూరుస్వామి, ప్రమీల, మహాలక్ష్మి, వన్నూరుస్వామి, ఉమాదేవి, బ్రాహ్మణపల్లికి చెందిన తులసి, కర్ణాటకలోని బసవనహళ్లికి చెందిన లక్ష్మయ్య, బెంగళూరు రూరల్ తాలూకా గుండంగేరికి చెందిన నాగరాజాచారి, నాగలక్ష్మి, చంద్రశేఖర్, జయలక్ష్మి, ప్రేమమ్మ, చిక్‌బళ్లాపురం జిల్లా డి.మల్లికెర గ్రామానికి చెందిన వెంకటరమణప్ప, యలహంకకు చెందిన పూర్ణిమాబాయి, బలసముద్రం నివాసులు ఆదెమ్మ, హనుమంతప్ప, దొడ్డబళ్లాపురానికి చెందిన ఆదిశేషు, తుమకూరుకు చెందిన పుష్పవతి తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టి, క్షతగాత్రులను ఆగమేఘాలపై గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో పరిస్థితి విషమంగా ఉన్న తులసి, పూర్ణిమాబాయి, ఆదిశేషు, లక్ష్మయ్యను మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి రెఫర్ చేశారు.



- గార్లదిన్నె: మండలంలోని కల్లూరు వద్ద 44వ జాతీయ రహదారిపై బొలెరో వాహనం బోల్తాపడిన ఘటనలో 11 మంది వ్యవసాయ కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. శింగనమల మండలం నాగులగుడ్డం తండాకు చెందిన 11 మంది కూలీలు ఉదయం పామిడి సమీపంలో సపోట కాయలు తొలగించి, సాయంత్రం బొలెరో వాహనంలో తిరుగు ప్రయాణమయ్యారు. కల్లూరులోని తరిమెల క్రాస్ వద్దకు చేరుకోగానే డ్రైవర్ వాటర్ బాటిల్ కోసం కిందికి వంగడంతో బొలెరో అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న పంట పొలంలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఘటనలో సోనియా బాయి, రామక్క, శంకరమ్మ, సులోచన, శారదాబాయి, గీతాబాయి, శంకరమ్మ, మంగమ్మ, నీలవేణి, లక్ష్మీదేవి, నాగేంద్ర తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలించారు. ఘటనపై గార్లదిన్నె పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

హంద్రీ-నీవా కాలువ పనులు వేగవంతం చేస్తాం

- కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్ (చిత్రంలో) ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, కాలవ శ్రీనివాసులు

కళ్యాణదుర్గం: జిల్లాలో హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాలువ పనులు వేగవంతంగా పూర్తి చేస్తామని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాలవ పనులు, ఇతర అంశాలపై ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుతో కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం హెచ్ఎన్ఎస్ఎస్ సీఈ, ఎస్ఈ, ఈఈలు, ఏఈలతో కలెక్టర్ సమీక్షించారు. హంద్రీనీవా కాలువ పనులు చేపట్టిన రెండేళ్ల లోపు పూర్తి చేయాలన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ 36బీ, 36సీ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాలని అధికారులను ఆదేశించారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి బీటీపీ వరకూ కాలువ పనులు చేపట్టే అంశాన్ని నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఫైనాన్స్ అడిషనల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. నేమకల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కి సంబంధించి ఏజెన్సీ నుంచి డీపీఆర్ అందాల్సి ఉందన్నారు. అంతకు ముందు రీ సర్వే పనులపై డివిజన్ స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్ఓ మలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ రామకృష్ణారెడ్డి, ఆర్డీఓ వసంత బాబు, సివిల్ సప్లయీస్ డీఎం రమేష్‌రెడ్డి, సర్వే ఏడీ రూప్లానాయక్, హెచ్ఎన్ఎస్ఎస్ సీఈ నాగరాజ, ఎస్ఈ రాజా స్వరూప్‌కుమార్, గుంతకల్లు ఈఈ శ్రీనివాసనాయక్, డీఈలు విశ్వనాథ్, రమణ, వెంకటరమణ, ఏఈలు దాదాఖలందర్, నాగభూషణం, భాస్కర్, నాగరాజు, పీజీఆర్ఎస్ తహసీల్దార్ వాణిశ్రీ,, డివిజన్ మండలాల తహసీల్దార్లు, డీటీలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

2 లోపు మోడల్ సర్వే పూర్తి చేయాలి

కళ్యాణదుర్గం రూరల్: మోడల్ సర్వేను మార్చి 2వ తేదీలోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కళ్యాణదుర్గంలోని ఆర్డీఓ కార్యాలయం నుంచి జీఎస్‌డబ్ల్యూఎస్, పీ–4 మోడల్ సర్వేపై జెడ్పీ సీఈఓ, డీపీఓ, డీఎల్‌డీఓలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులందరూ బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరిగా వేయాలన్నారు. వివిధ రకాల సేవలకు సంబంధించిన సర్వీసుల మొత్తాన్ని రెండు రోజుల్లోపు ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలన్నారు.

పెట్రోల్ బంకుల్లో మోసం.. తనిఖీల్లో బట్టబయలు


పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ డీఎస్పీ

అనంతపురం: నగర శివారున సోములదొడ్డి వద్ద ఉన్న విజయలక్ష్మి (ఇండియన్) పెట్రోల్ బంక్‌లో చిప్ అమర్చి మీటర్ రీడింగ్‌ను ట్యాంపరింగ్ చేస్తున్నట్లుగా విజిలెన్స్ అధికారులు నిర్ధారించారు. శుక్రవారం చేపట్టిన తనిఖీల్లో చిప్‌ను విజిలెన్స్ అధికారులు పసిగట్టారు. ఏడాదిలో 28 లక్షల లీటర్ల డీజిల్ అమ్మకం జరగగా, ఇందులో 2.80 లక్షల లీటర్ల సొమ్మును స్వాహా చేసినట్లుగా గుర్తించారు. ఇలాంటి చిప్ తరహాలోనే జిల్లాలో మరిన్ని పెట్రోల్ బంకుల్లో మోసాలు జరుగుతున్నాయని, అన్నింటిపై విస్తృత తనిఖీలు చేపట్టి అక్రమాలను అడ్డుకుంటామని విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


శ్రీనివాసులు (ఫైల్)

గార్లదిన్నె: అప్పు తీర్చకపోతే భూమిని కోల్పోయాల్సి వస్తుందన్న మనోవేదన తాళలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు... గార్లదిన్నె మండలం ముంటిమడుగు కొత్తూరుకు చెందిన శ్రీనివాసులురెడ్డి (55)కు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. తనకున్న రెండు ఎకరాల్లో పంటల సాగు, ఇతర అవసరాల కోసం భూమిని ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద తాకట్టు పెట్టి అప్పు తీసుకున్నాడు. వడ్డీల భారం పెరిగి అది రూ.8లక్షలకు చేరుకుంది. ఈ క్రమంలో గడువు సమీపిస్తుండడంతో అప్పు తీర్చకపోతే భూమిని కోల్పోవాల్సి వస్తుందంటూ మనోవేదనకు లోనై గురువారం సాయంత్రం తన తోటలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చీకటి పడుతున్నా భర్త ఇంటికి రాకపోవడంతో ఆయన భార్య, కుటుంబసభ్యులు గాలింపు చేపట్టారు. శుక్రవారం ఉదయం తోటలో చెట్టుకు విగతజీవిగా వేలాడుతున్న శ్రీనివాసులరెడ్డిని గమనించి బోరున విలపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మార్చి 24, 25న బ్యాంకు ఉద్యోగుల సమ్మె

అనంతపురం అగ్రికల్చర్: యూఎఫ్‌బీయూ పిలుపు మేరకు మార్చి 24, 25న దేశవ్యాప్తంగా తలపెట్టిన బ్యాంకుల సమ్మెను విజయవంతం చేయాలని బ్యాంకు ఉద్యోగ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం అనంతపురంలోని ఎస్‌బీఐ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడారు. బ్యాంకుల్లో అన్ని విభాగాల్లో ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి పర్మనెంట్ నియామకాలు చేపట్టాలని, బ్యాంకుల ప్రైవేటీకరణ ఆపాలని, తదితర డిమాండ్ల సాధనకు మార్చి 24, 25న సమ్మెలోకి వెళుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు కె.ఖాదర్‌బాషా, చంద్రమోహన్, అనూష, నీలిమ, భారతి, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శేషవాహనంపై ఆదిదంపతుల వైభవం



శివపార్వతులను పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్: మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఆదిదంపతులు శేషవాహనంపై దర్శనమిచ్చారు. పల్లకీ సేవలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నగరోత్సవంలో కళాబృందాలు స్వామిని కీర్తిస్తూ భక్తిగీతాలు ఆలపించారు. వినాయక నృత్య కళానికేతన్ శిక్షణాలయం నాట్యాచార్యుడు విజయ్ కుమార్ నేతృత్వంలో సాగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మహన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకం, దీక్షా హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈఓ రమేష్‌బాబు, భక్తమండలి సభ్యులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు ప్రథమ ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇచ్చి, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అనంతపురం రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు అధికారులు గ్రామాలను సందర్శించాలని తెలిపారు. ప్రజలతో మమేకమై వారితో స్నేహ భావంతో మెలిగినప్పుడే పోలీసులపై విశ్వాసం పెరుగుతుందన్నారు. అనంతపురం రూరల్ సబ్ డివిజన్ పరిధిలో నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్, ఆస్తి సంబంధిత నేరాలు, ఇతర కేసుల నమోదు, చేధనపై స్టేషన్ల వారీగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అనంతపురం రూరల్ డీఎస్పీ టి.వెంకటేశ్, సీఐలు శేఖర్, హేమంత్ కుమార్, శ్రీ హర్ష, కరుణాకర్, కౌలుట్లయ్య, సత్తిబాబు పాల్గొన్నారు.

రైతులను ముంచేసిన దళారి

అనంతపురం: నగరానికి చెందిన ఓ దళారి రైతులను ముంచేశాడు. నాలుగో పట్టణ సీఐ సాయినాథ్ తెలిపిన వివరాలు.. రాంనగర్‌లో నివాసం ఉంటున్న ఇటుకలపల్లి యశ్వంత్ వరుసకు అక్క అయిన భానుమతి మధ్యవర్తిత్వంతో కడప జిల్లా ప్రొద్దుటూరులోని వివిధ ప్రాంతాల్లో మొత్తం 237 క్వింటాళ్ల వేరుశనగ కొనుగోలు చేశాడు. డబ్బుకు భానుమతి పూచీ ఇచ్చింది. నెలలు గడిచినా రైతులకు యశ్వంత్ డబ్బులు చెల్లించలేదు. పలు దఫాలు ఫోన్ చేస్తే భానుమతిని ఫోన్‌లోనే దుర్భాషలాడుతూ బెదిరించాడు. శుక్రవారం రైతులతో కలిసి భానుమతి నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో యశ్వంత్ పారిపోయాడు. వచ్చే లాభంలో కొంత కమిషన్ ఇస్తానని చెప్పడంతో డబ్బుకు పూచీ ఇచ్చాను.. ఇలా మోసం చేస్తాడని ఊహించలేదని భానుమతి కన్నీరుమున్నీరైంది. కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

'చౌకబారు రాజకీయాలు మానుకోండి'



మాట్లాడుతున్న మదిరెడ్డి నరేంద్ర రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక కూటమి ప్రభుత్వం సోషల్ మీడియాలో దుష్ప్రచారానికి పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మదిరెడ్డి నరేంద్ర రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లాలో జరిగిన యువభేరి కార్యక్రమంలో తాను పాల్గొనడం జరిగిందన్నారు. ఇటీవల విజయవాడలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఓ 13 ఏళ్ల బాలిక కలిస్తే.. ఆ ఫొటోలో తాను కూడా ఉన్నట్లు కూటమి సోషల్ మీడియా దుష్ప్రచారం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ఇలాంటి చౌకబారు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. దుష్ప్రచారం మానుకోవాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బాబాసలాం, విద్యార్థి విభాగం నాయకులు సుధీర్ రెడ్డి, నవీన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దిగుబడి రాలేదప్పా..

- రబీ సీజన్‌లో తెగుళ్లతో దెబ్బతిన్న వేరుశనగ
- ముంచేసిన మచ్చ, ఎండు తెగులు, రసంపీల్చు పురుగు
- గిట్టుబాటు ధర కల్పించని ప్రభుత్వం
- అప్పులపాలవుతున్న అన్నదాతలు



కనగానపల్లి వద్ద దిగుబడి లేని వేరుశనగ పంట

కనగానపల్లి: రబీ సీజన్‌లో బోరుబావుల కింద వేరుశనగ సాగు చేసిన రైతులకు నిరాశ ఎదురైంది. ఖరీఫ్‌లో వచ్చిన నష్టాలను పూడ్చుకుందామని భావించిన అన్నదాతలకు నష్టాలు మిగులుతున్నాయి. రాప్తాడు నియోజక వర్గంలోని ఆరు మండలాల్లో సుమారు 15 వేల హెక్టార్లలో వేరుశనగ సాగు చేశారు. ఖరీఫ్ ఆఖరులో వర్షాలు కురవడం, బోరుబావుల్లో నీరు పుష్కలంగా ఉన్న రైతులు ఎక్కువగా వేరుశనగ సాగుకు మొగ్గు చూపారు. అయితే పంటలు సాగు చేసిన 15 రోజులకే మచ్చ తెగులు వ్యాపించి పంట ఎదుగుదలను దెబ్బతీసింది. వీటితో పాటు రసంపీల్చు పురుగు, ఎండుతెగులు వ్యాపించాయి. తెగుళ్ల నివారణకు ఎన్నిసార్లు మందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోయింది. గత ఏడాది ఆఖరులో సాగు చేసిన ఈ పంట ప్రస్తుతం కోత దశలో ఉంది. అయితే చాలా ప్రాంతాల్లో పంట దిగుబడులు నిరాశజనకంగా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. ఎకరానికి కనీసం 10 బస్తాల దిగుబడి రాక నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. కొన్నిచోట్ల పంట దిగుబడులు లేక రైతులు ముందుగానే పంటను తొలగించి పశుగ్రాసానికి వాడేసుకుంటున్నారు.

ఎకరాకు రూ.30 వేల పెట్టుబడి

వేరుశనగ పంటకు రాష్ట్ర ప్రభుత్వం సరైన గిట్టుబాటు ధర కల్పించడం లేదని రైతులు వాపోతున్నారు. బోరుబావుల కింద ఈ పంట సాగు చేసేందుకు ఎకరానికి రూ.30 వేల దాకా పెట్టుబడి పెట్టారు. తెగుళ్లతో ఎకరానికి 10 బస్తాల దిగుబడి కూడా రాలేదని చెబుతున్నారు. దీనికి తోడు ప్రస్తుతం మార్కెట్లో వేరుశనగ కాయలు బస్తా రూ.2,500 కూడా ధర పలకడం లేదు. పంట పెట్టుబడులు కూడా దక్కక చాలా నష్టపోతున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేరుశనగ పంటకు ప్రభుత్వం కనీసం రూ.4 వేల (బస్తాకు) మద్దతు ధర కల్పించాలని కోరుతున్నారు.

● పంట దెబ్బతింది



ఈ రబీలో మూడు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశాను. సాగు చేసిన 15 రోజుల నుంచే తెగుళ్లు వ్యాపించాయి. వీటి నివారణ కోసం ఇప్పటి వరకూ 8 సార్లు పురుగు మందులు పిచికారీ చేయించాం. అయినా తెగుళ్ల వ్యాప్తి తగ్గలేదు. పంటల సాగుకు రూ.40 వేల దాకా ఖర్చు చేశాను. ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రాలేదు. దిగుబడి తగ్గిపోయి చాలా నష్టపోవాల్సి వచ్చింది.

– సంజీవరెడ్డి, రైతు, తగరకుంట

● గిట్టుబాటు ధర కల్పించాలి



వేరుశనగ పంటకు ప్రభుత్వం సరైన గిట్టుబాటు ధర కల్పించాలి. ప్రస్తుతం బయట మార్కెట్లో బస్తా రూ.2,500 కూడా పలకటం లేదు. పంట దిగుబడులు నామమాత్రంగా ఉన్నాయి. గిట్టుబాటు ధర లేక రూ.లక్ష దాకా నష్టపోతున్నాం. ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం జరిగేలా చూడాల్సిన అవసరం ఉంది.

– చిన్నపెద్దిరెడ్డి, రైతు, బాలేపాళ్యం

'బడ్జెట్‌లో నగరానికి నిధులు రాబట్టాలి'

- మేయర్ వసీం



అనంతపురం కార్పొరేషన్: రానున్న బడ్జెట్‌లో అనంతపురం నగరానికి నిధులు రాబట్టేందుకు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ కృషి చేయాలని మేయర్ వసీం సూచించారు. శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, నడిమివంకకు ప్రహరీ నిర్మించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. ఎమ్మెల్యే అయ్యాక పత్తా లేకుండా పోయారన్నారు. ప్రజా అవసరాలు తీర్చాలంటే అదనంగా నిధులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ద్వారా రూ.25 కోట్ల నిధులు తీసుకొచ్చారన్నారు. కొన్ని పనులు చేపడితే.. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ పనులకు బ్రేక్ పడిందన్నారు. నగరంలో అవసరమైన ప్రతి చోట రక్షణ గోడలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రమేష్ గౌడ్‌కు సన్మానం



రమేష్ గౌడ్‌ను సన్మానిస్తున్న వివిధ సంఘాల నాయకులు

అనంతపురం కార్పొరేషన్: ఇంటర్నేషనల్ ఎక్సలెన్సీ అవార్డు గ్రహీత, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిట్లూరి రమేష్ గౌడ్‌ను పలువురు ఘనంగా సన్మానించారు. శుక్రవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన అభినందన సభకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజా సంఘాలతో పాటు విద్యార్థి నేతలు, కుల సంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. తన 14 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో అసమానతలు లేని సమాజం కోసం ఓ వైపు పోరాటం చేస్తూనే.. మరో వైపు సమాజానికి సేవ చేస్తున్నట్లు తెలిపారు. దుబాయి వేదికగా అంతర్జాతీయ స్థాయి అవార్డు తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో పని చేస్తున్నప్పుడు ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానన్నారు. అందరి సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు కుళ్లాయప్ప, జెన్నే చిరంజీవి, విష్ణువర్ధన్, మల్లికార్జున నాయక్, సుదర్శన్, పృథ్వీ, మహదేశ్, నగేష్, నాయకులు విజయ్‌కుమార్, లబ్బే రాఘవ, హేమకిరణ్, అచ్యుత్, నరేంద్ర, గణ, రవీంద్ర, వెంకటేష్, దూదు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం



మాట్లాడుతున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు

అనంతపురం కార్పొరేషన్: 'ప్రొఫెసర్లు ఓపీల్లో రోగులకు సేవలందించాలి. వైద్యులు సమయపాలన పాటించాలి. అనంతపురం బోధనాస్పత్రిని రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలుపుదామని' వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జున రెడ్డి హెచ్ఓడీలకు సూచించారు. శుక్రవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో వివిధ విభాగాల హెచ్ఓడీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డీన్ డాక్టర్ మాణిక్య రావు మాట్లాడుతూ.. ఐవీఆర్ఎస్‌లో కింది స్థాయిలో అనంతపురం బోధనాస్పత్రి వచ్చిందన్నారు. ఇక నుంచి ఆ స్థాయిని పెంచుకునేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలన్నారు. త్వరలో జరగబోయే సిల్వర్ జూబ్లీ వేడులకు అందరూ సహకరించాలని కోరారు. ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజాప్రతినిధుల సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామన్నారు. సమావేశానికి కొందరు ప్రొఫెసర్లు గైర్హాజరవడాన్ని తప్పుబట్టారు. సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ.. రోగులకందించే సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. ఆస్పత్రి ఏడీ మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ.. ఎవరైనా నాల్గవ తరగతి ఉద్యోగులు, నాన్ మెడికల్ ఉద్యోగులు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుని సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు.

నా చావుకు కారణం ఆ యువకుడే!

- దేవరకొండ భువనేశ్వరి ఆత్మహత్య కేసులో కొత్త మలుపు
- ఆత్మహత్యకు ముందు రాసిన లేఖను స్వాధీనం చేసుకున్న పోలీసులు

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేట శివారున ఉన్న భాగ్యనగర్‌కు చెందిన దేవరకొండ భువనేశ్వరి (24) ఆత్మహత్య కేసులో కొత్త మలుపు వెలుగు చూసింది. తిప్పేస్వామి, నీలావతి దంపతుల చిన్న కుమార్తె భువనేశ్వరి ఈ నెల 16న ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఇటీవల ఓ ప్రైవేట్ రెసిడెన్షియల్ స్కూల్‌లో వార్డెన్‌గా చేరిన భువనేశ్వరి మృతి అనంతరం మరుసటి రోజు తల్లిదండ్రులు అక్కడికెళ్లి లగేజ్ తీసుకుని వచ్చారు. ఇందులో ఓ నోటు పుస్తకాన్ని పరిశీలించిన వారు ఆత్మహత్యకు ముందు తమ కుమార్తె రాసిన లేఖను చూసి కంగుతిన్నారు. 'రేపొద్దున నేను ఆత్మహత్య చేసుకుంటే ఫలానా యువకుడే కారణం' అంటూ అందులో యువకుడి పేరుతో పాటు ఫోన్ నంబర్‌నూ ఆమె స్పష్టంగా రాసి పెట్టింది. దీంతో తల్లిదండ్రులు నేరుగా రూరల్ పోలీసులను కలిసి లేఖను అందజేశారు. విచారణలో గతంలో భువనేశ్వరి వలంటీరుగా పనిచేస్తున్న సమయంలో ఓ యువకుడి ప్రేమలో పడినట్లుగా గుర్తించారు. దీనిపై సీఐ శేఖర్ మాట్లాడుతూ.. 'భువనేశ్వరి ఆత్మహత్య చేసుకునేందుకు ముందు ఓ యువకుడి పేరుతో లేఖ రాసుకున్నట్లు తల్లిదండ్రులు చూపించారు. ఆ మేరకు విచారణ చేపట్టాం' అని తెలిపారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ఉపాధి అవకాశాలు



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జేఎన్‌టీయూ(ఏ) రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణయ్య

అనంతపురం: ఫార్మసీ రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా నూతన ఆవిష్కరణలు ఉండాలని జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య అన్నారు. శుక్రవారం ఓటీపీఆర్ఐలో 2024 బీఫార్మసీ బ్యాచ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఆహ్వానం పలికే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేథ) ఫార్మసీ రంగంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ రంగంలో నైపుణ్యాలు పెంపొందించుకుంటే అపారమైన అవకాశాలు దక్కుతాయని పేర్కొన్నారు. ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించడంలో ఫార్మసిస్టుల పాత్ర గొప్పదన్నారు. విద్యార్థులు తమ దైనందిన జీవితంలో చక్కని క్రమశిక్షణను అలవరుచుకోవాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చక్కా గోపీనాథ్, డిప్యూటీ రిజిస్ట్రార్ బి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

భరతనాట్యంలో ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న ఏజీఎం సుబ్బారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఇటీవల రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ మండలంలో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, నృత్య గోల్డెన్ స్టార్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్తంగా రికార్డ్స్ తెలంగాణ వారి ఆధ్వర్యంలో భరతనాట్యం పోటీలు జరిగాయి. 3 వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో స్థానిక కోర్టు రోడ్డులోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థిని గగన శ్రేయ ప్రతిభ కనబరిచిందని ఏజీఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ తబస్సుమ్ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ కో–ఆర్డినేటర్ ఇర్షాద్, ఏఓ గోపాల్, డీన్లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్, ప్రైమరీ ఇన్‌చార్జ్ భారతి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు సింగంపల్లికి మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: మండలంలోని సింగంపల్లి గ్రామానికి శనివారం ఉదయం 9 గంటలకు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విచ్చేస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలపోతన్న, యూత్ కన్వీనర్ కొండారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హంద్రీ–నీవా కాలువ లైనింగ్‌పై రైతులతో మాట్లాడతారని పేర్కొన్నారు. అనంతరం హంద్రీ–నీవా కాలువను పరిశీలిస్తారని వెల్లడించారు. మండలంలోని రైతులందరూ తరలి రావాలని పిలుపునిచ్చారు.

కటాక్షించు.. సరస్వతీ

ఆత్మకూరు: స్థానిక కస్తూర్బా పాఠశాలలో శుక్రవారం సరస్వతీ పూజ నిర్వహించారు. చదువుల తల్లి సరస్వతీ దేవి చిత్రపటాన్ని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. మంచి మార్కులు వచ్చేలా దీవించు సరస్వతీ మాత అంటూ పదో తరగతి విద్యార్థినులు ప్రార్థించారు.

బాలోత్సవంలో ప్రతిభ

ఆత్మకూరు: జిల్లా కేంద్రంలో ఇటీవల జరిగిన బాలోత్సవం కార్యక్రమంలో పంపనూరు తండా పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు ఎంఈఓ నరసింహారెడ్డి తెలిపారు. ఫ్యాన్సీ డ్రెస్, డ్రాయింగ్, జానపద గేయం, నృత్యం పోటీల్లో బహుమతులు గెలుచుకున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఎంఈఓ చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం వెంకటరత్నం, ఉపాధ్యాయురాలు శ్రీలేఖ పాల్గొన్నారు.

నిత్యావసరాల వితరణ

అనంతపురం కల్చరల్: సాయిట్రస్టు ఆధ్వర్యంలో బెరాకా ఆశ్రమంగా పిలవబడే గొట్కూరు ఆనంద నిలయానికి శుక్రవారం రూ.20 వేలు విలువైన నిత్యావసరాలు, వృద్ధులకు మందులు అందజేశారు. ట్రస్టు అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. స్థానిక మూడవ రోడ్డుకు చెందిన భాగ్యలక్ష్మమ్మ మరణించడంతో ఆమె మనవళ్లు నిత్యావసర వస్తువులు అందజేశారని పేర్కొన్నారు.

'మా భూమిని కబ్జా చేస్తున్నారు'

అనంతపురం టవర్‌క్లాక్: 'బుక్కరాయ సముద్రం మండల కేంద్రంలోని శివాలయం గుట్ట సమీపంలో సర్వే నంబర్ 746–3, 747–2లో 57.50 సెంట్ల భూమిని టీడీపీ నాయకులు దౌర్జన్యంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. మాపై దాడి కూడా చేశారు. టీడీపీ నాయకుల నుంచి రక్షణ కల్పించాలి' అని బాధితులు చిత్ర, నాగమ్మ, మోహన్ కుమార్, వెంకటరాముడు, ఆంజనేయులు కోరారు. శుక్రవారం వారు స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. భూమిని సర్వే చేయించుకుంటుండగా అనంతపురం రెండవ డివిజన్‌కు చెందిన టీడీపీ నాయకులు గుర్రం నాగభూషణం, అతడి తమ్ముడు నాగరాజు, పావురాల చంద్రశేఖర్ కొంత మంది అనుచరులతో వచ్చి దాడి చేశారని తెలిపారు. మా భూమిని దౌర్జన్యంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. వీరిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

అనంతపురం: నగర పరిధిలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన చెరుకుతోట సాయి (26) శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మెడికల్ రెప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్న సాయి.. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. విధులకు వెళ్లకుండా కుటుంబాన్ని నిర్లక్ష్యం చేశాడు. తరచూ కుటుంబ సభ్యులతో గొడవపడటంతో మందలించేవారు. ఈ క్రమంలో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ స్థాయి సమావేశానికి 'జీడీఎస్' ప్రతినిధులు

అనంతపురం సిటీ: ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ (ఏఐజీడీఎస్‌యూ) ఉమ్మడి జిల్లా ప్రతినిధులు శుక్రవారం కలకత్తాకు బయలుదేరి వెళ్లారు. శని, ఆదివారాల్లో కలకత్తాలో జరగనున్న యూనియన్ జాతీయ స్థాయి సమావేశంలో పాల్గొనేందుకు తామంతా బయలుదేరి వెళ్లినట్లు యూనియన్ అనంతపురం సర్కిల్ కార్యదర్శి కృష్ణయ్య యాదవ్ తెలిపారు. జాతీయ స్థాయిలో జీడీఎస్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలు, గతంలో ఇచ్చిన సమ్మె నోటీసు, సమ్మె సమయంలో కీలక అధికారులు హామీల అమలుపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు వివరించారు. జీడీఎస్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమ్మె ఒక్కటే పరిష్కారంగా భావిస్తున్నామని తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే వచ్చే ఏడాదికి సీట్ల రిజర్వేషన్ పేరుతో కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజులు వసూళ్లు చేస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి మండిపడ్డారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఫిబ్రవరి మాసం నుంచే ముందస్తు అడ్మిషన్ల ప్రక్రియను మొదలు పెట్టారన్నారు.

ఉమ్మడి పీజీ ప్రవేశ పరీక్షలను రద్దు చేయాలి



ఐక్యత చాటుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలు, విశ్వవిద్యాలయాలను కాపాడుకుందామని విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా) ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి ఉమ్మడి ప్రవేశ పరీక్షలను రద్దు చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయి స్వామి, వైఎస్సార్‌సీపీ ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, పీడీఎస్‌యూ జిల్లా కన్వీనర్ అశోక్, ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి సురేష్ యాదవ్, పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర, ఎన్‌వీఐపీ రాష్ట్ర అధ్యక్షుడు రామన్న తదితరులు పాల్గొన్నారు.

30 టన్నుల టమాట కొనుగోలు

అనంతపురం అగ్రికల్చర్: మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కక్కలపల్లి మండీలో రైతుల నుంచి 30 టన్నుల టమాటాలు కొనుగోలు చేశారు. మార్కెటింగ్ శాఖ డీడీ శ్రీకాంత్‌రెడ్డి, రైతుబజార్ ఎస్టేట్ అధికారి ప్రతాప్‌రుద్ర తదితరులు రైతుల నుంచి కిలో రూ.5 ప్రకారం కొనుగోలు చేశారు. రెండు లారీల్లో వాటిని విజయవాడ, గుంటూరుకు పంపించారు. బహిరంగ మార్కెట్‌లో టమాట ధరలు పూర్తిగా తగ్గిపోవడంతో రైతులు నష్టపోకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

రాప్తాడు: హంపాపురం, గాండ్లపర్తి విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది. ఈ మేరకు ట్రాన్స్‌కో ఏఈ శివ ప్రసాద్ నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



తెలుగుతల్లి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం అనంత సాహితీ సంస్థల ప్రతినిధులు ఘనంగా జరుపుకున్నారు. దేశభాషలందు తెలుగు లెస్స అంటూ విద్యార్థులు నినదిస్తూ ర్యాలీ చేపట్టారు. తెలుగు భాషా వికాస ఉద్యమం, తెలుగు భాషా సంరక్షణ సమితి, డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీ సమితి, జిల్లా రచయితల సంఘం, మహాబోధి, సాహిత్య భారతీ ప్రతినిధులు తెలుగు తల్లి విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంగ్లిష్‌ను గౌరవిస్తూ తెలుగు భాషను ప్రేమిద్దామని.. వీలైనంత మేరకు తెలుగులోనే మాట్లాడుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సాహితీ సంస్థల ప్రతినిధులు డాక్టర్ జగర్లపూడి శ్యామసుందర శాస్త్రి, డాక్టర్ బి.నారాయణ, చెట్ల ఈరన్న, దాసన్నగారి కృష్ణమూర్తి, సీనియర్ గాయకుడు కేవీ మహీధర్, పండిట్ రియాజుద్దీన్ అహ్మద్, డాక్టర్‌నగరూరు రసూలు, డాక్టర్ నాగేంద్ర, పూజారి ఈరన్న, సరిత, సునీత, లక్ష్మీనారాయణ, నాగరాజు, ముత్యాలప్ప, వెంకటనారాయణ, ఫైరోజ్, కిషోర్ తోట నాగరాజు పాల్గొన్నారు.

గ్రూప్–2 రోస్టర్ సవరించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న అభ్యర్థులు

అనంతపురం అర్బన్: ఏపీపీఎస్సీ గ్రూప్–2 రోస్టర్ పాయింట్లను సవరించిన తరువాతే మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట గ్రూప్–2 అభ్యర్థులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రూప్–2 అభ్యర్థులు మాట్లాడుతూ.. గ్రూప్–2 పరీక్షల రోస్టర్‌లో లోపాలు ఉన్నాయని తెలిపారు. చాలామంది అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరిగిందన్నారు. యువత భవిష్యతను దృష్టిలో ఉంచుకుని ఈ అంశంపై ప్రభుత్వం తక్షణం స్పందించాలన్నారు. తప్పిదాలను పరిశీలించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. పరీక్షలో జరిగిన తప్పిదాలను సరిచేసి మరోసారి గ్రూప్–2 పరీక్ష నిర్వహించాలన్నారు. తప్పులను ప్రభుత్వం సరిదిద్దకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ వి.వినోద్ కుమార్‌కు వినతిపత్రం అందజేసి పరిస్థితిని వివరించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు దేవేంద్ర, శ్రీనివాస్, రాంబాబు, అభ్యర్థులు ఓంప్రకాష్, లోకేష్, నవీన్, ఈశ్వర్, బాలు, రామకృష్ణ, తిరుమల, తిరుపతయ్య, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగస్వాములవ్వాలి

అనంతపురం అర్బన్: సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. విలువల బడి నిర్వహిస్తున్న సమాజ క్రాంతి చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని కొనియాడారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో విలువల బడి బ్రోచర్లను ట్రస్టు సభ్యులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సామాజిక సేవలో భాగంగా విలువల బడుల ద్వారా పర్యావరణ పరిరక్షణ, గ్రామీణ ప్రాంత మహిళలు, యువతకు టైలరింగ్, డ్రైవింగ్, స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇవ్వడం హర్షణీయమన్నారు. ట్రస్ట్ నిర్వాహకుడు లెనిన్‌బాబు మాట్లాడుతూ.. ప్రస్తుతం కుందుర్పి మండల పరిధిలోని 23 గ్రామాల్లో విలువల బడి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. త్వరలో అనంతపురం నగరం, రాయదుర్గం నియోజకవర్గంలో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. మీనాక్షమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు రవికాంత్ రమణ, ఏజీఎస్ రెడ్డి ఫౌండేషన్ అధ్యక్షురాలు ప్రమీలమ్మ, సమాజ క్రాంతి ట్రస్ట్ కో–ఆర్డినేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

'రైతుబడి అగ్రిషో'కు తరలిరండి



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సునీత

రాప్తాడు: మండల కేంద్రంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించే 'రైతుబడి అగ్రిషో' కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా రైతులు తరలిరావాలని ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపునిచ్చారు. శుక్రవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయ అంశాలు వివరించేందుకు సుమారు 300 కంపెనీలు ఎగ్జిబిషన్‌లో పాల్గొంటాయని తెలిపారు. ఆధునిక వ్యవసాయ పరికరాలు, డ్రోన్ యంత్రాలు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వివిధ రకాల పండ్ల మొక్కలు, నానో టెక్నాలజీ, శాటిలైట్ సాయిల్ టెస్టింగ్, ఆటో స్టార్టర్, ఫెన్సింగ్, డ్రిప్, ఇరిగేషన్ కంపెనీలు పాల్గొంటాయని వివరించారు. వ్యవసాయ అనుబంధ రంగాలైన డెయిరీ, పౌల్ట్రీ, ఫిషరీస్, పట్టు పురుగులు, మేకలు, గొర్రెల పెంపకంపై సమగ్ర సమాచారం తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు.